సాక్షి
గుంటూరు
ఆదివారం । 24 । నవంబర్ । 2024





## అన్నదానం

కారెంపూడి: స్థానిక వీరాంజనేయస్వామి దేవాలయంలో శనివారం వాసవి సేవాదళ్ ఆధ్వర్యాన 400 మంది భక్తులకు అన్నదానం చేశారు.



## సత్యసాయి జయంతి వేడుకలు

మాచర్ల: సత్యసాయి విద్యావిహార్‌లో శనివారం సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ప్రార్థనలు చేశారు. అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి ఉన్నారు.



## వైభవంగా సుబ్రమణ్యస్వామి కల్యాణం

కర్లపాలెం: ఎంవీరాజుపాలెంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

## న్యూస్‌రీల్

### ఏఎన్‌యూలో ఫార్మసీ వారోత్సవాలు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె. రత్న షీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంలు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. రెక్టార్ మాట్లాడుతూ.. ఔషధాలు, వ్యాక్సిన్‌ల తయారీలో ఫార్మసిస్టుల పాత్ర చాలా కీలకమన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ... రోగాలకు మందులను తయారు చేయటంలో బయో టెక్నాలజీ, ఫార్మసీ అత్యంత ప్రాముఖ్యత వహిస్తున్నాయన్నారు. విద్యార్థులకు షార్ట్ ఫిల్మ్, క్విజ్, ఎలక్యూషన్, పోస్టర్ ప్రజంటేషన్, పిక్చర్ స్పీక్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎ. ప్రమీల రాణి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ కె.సుజన, వైద్యులు రవి శంకర్ రెడ్డి, యు.అన్నపూర్ణ, ఎస్.కె. మస్తానమ్మ, ప్రవల్లిక, పి.రవి, గాయత్రి రమ్యతోపాటు కె. విజయ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### తెనాలి కేకేఆర్ గౌతమ్ స్కూల్‌కు షోకాజ్ నోటీసు

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలిలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌కు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న షేక్ మెహరాజ్ అనే విద్యార్థి శుక్రవారం పాఠశాల ముగిసిన అనంతరం స్టాండ్‌లో నుంచి సైకిల్ తీసుకుంటున్న సమయంలో ఐదో అంతస్తు నుంచి కిటికీ, సంబంధిత అద్దాలు మీదపడిన సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ప్రిన్సిపల్ తీసుకెళ్లారు. బ్రెయిన్ స్కాన్, సీటీ స్కాన్ తీయించాక చికిత్స అనంతరం ప్రమాదమేమీ లేదని వైద్యులు చెప్పినట్లు డీఈవో రేణుక తెలిపారు. ఎంఈవో ద్వారా విచారణ నివేదిక తెప్పించుకున్న డీఈవో... విద్యార్థి వైద్య ఖర్చులను యాజమాన్యమే భరించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. భద్రతాపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైన యాజమాన్యానికి పాఠశాల గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలని వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

### సీజీహెచ్‌ఎస్ రాష్ట్ర కార్యాలయ ఏర్పాటుపై వినతి



లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పాటయ్యే 'సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సి.జి.హెచ్.ఎస్.) రాష్ట్ర కార్యాలయాన్ని విశాఖపట్నంలో కాకుండా గుంటూరు లేదా విజయవాడలో ఏర్పాటు చేయాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సి.బి.ఐ.సి.) రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు టి. వివేకానంద, గద్దె తిలక్‌లు కోరారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద గల సి.జి.హెచ్.ఎస్. కార్యాలయానికి శనివారం తనిఖీ నిమిత్తం వచ్చిన అడిషనల్ డైరెక్టర్ దండు పూర్ణచంద్రరావును సంఘం ప్రతినిధులు కలిశారు. సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎ.పి.లోని 26 జిల్లాలకు కేవలం ఏడు చోట్ల వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. వీటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పి.కోటేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, సి.జి.హెచ్.ఎస్. డాక్టర్లు టి.సీహెచ్. కోటేశ్వరరావు, డి.తుకారాం, అయేషా, సునీల్, రామారావు, మురళీ పాల్గొన్నారు.

### కార్మికులకు మద్దతు



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మద్దతు ఇస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ సలీమ్, దర్శనపు సామేల్ తెలిపారు. శనివారం దీక్షా శిబిరాన్ని సందర్శించాక వారు మాట్లాడుతూ కోర్టు తీర్పులు కార్మికులకు అనుకూలంగా ఉన్నా యాజమాన్యం స్పందించడం లేదన్నారు. మంత్రి లోకేష్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, కాంగ్రెస్ నాయకులు పటాన్ సుభాని, కె.కృష్ణ చౌదరి, కార్మికులు స్టీవెన్, ఎ.వెంకట స్వామి, బి. సమర్పణ రావు, జి.అర్జునరావు, ఎస్‌కే ఝూన్సీ, దుర్గా భవాని, సుభాని, ఇశ్రాయేల్, ఎం. ఆశీర్వాదం, బి.అంకయ్య, రమాదేవి, నవనీతం, శారద, సారమ్మ, సామ్రాజ్యం, సాంబయ్య, సూర్య ప్రకాష్, యెహోషువా పాల్గొన్నారు.

---

శిలాఫలకాలపై వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీల పేర్లు లేకపోవడంపై ఆందోళన

- టీడీపీ నాయకుల పేర్లు ముద్రించడంపై తీవ్ర అభ్యంతరం
- గురుకులాల్లో తాగునీటి ఎద్దడి పై ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీల ఆవేదన
- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంపై నిలదీత
- ప్రొటోకాల్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్న కేంద్ర మంత్రి పెమ్మసాని
- ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లలకు ఉచిత విద్య నిరాకరణపై సభ్యుల ఆగ్రహం
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై నిలదీసిన ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ హెని క్రిస్టినా, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అధికారులు

# జెడ్పీ సమావేశంలో ప్రొటోకాల్ రగడ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ ఉల్లంఘనపై సభ్యులు అధికారులను నిలదీశారు. జెడ్పీటీసీలకు తెలియకుండా ఎమ్మెల్యేల సిఫార్సులతో ఏకపక్షంగా పనులు చేపట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన సమావేశానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మూడు జిల్లాల అధికారులు హాజరయ్యారు.

**శిలా ఫలాకాలపై టీడీపీ నాయకుల పేర్లపై అభ్యంతరం**

జెడ్పీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ప్రజాప్రతినిధులమైన తమ పేర్లు లేకుండా టీడీపీ నాయకుల పేర్లు రాయడంపై రొంపిచర్ల, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు ఓబుల్‌రెడ్డి, మస్తాన్ రావు అధికారులను నిలదీశారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమరావతి మండలం ఎనికేపాడు గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలపై జెడ్పీటీసీ, సర్పంచ్‌ల పేర్లు రాయకపోవడంపై అధికారులు సమాధానం చెప్పాలని ఎంపీపీ మేకల హనుమంతరావు నిలదీశారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి యేసురత్నం మాట్లాడుతూ శిలాఫలకాలపై టీడీపీ నాయకుల పేర్లు రాసిన సంఘటనలు నియోజకవర్గ ఎమ్మెల్యేలకు తెలియకుండా జరగవని, దీనిపై అధికారులను బాధ్యులను చేయడం ద్వారా ప్రయోజనం లేదన్నారు. శిలాఫలకాలపై ముద్రించిన టీడీపీ నాయకుల పేర్లు తుడిచేందుకు ప్రయత్నించే సాహసాన్ని అధికారులు చేయలేరని అన్నారు. ఎమ్మెల్యేలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి, ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకండా చూడాలని అన్నారు. మరో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ప్రొటోకాల్‌పై కఠినంగా వ్యవహరించాలని, కలెక్టరేట్‌లో జరిగిన డీఆర్సీ సమావేశానికి కూడా తనను ఆహ్వానించని విషయాన్ని గుర్తుచేశారు.

**ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా చూస్తాం**

ప్రొటోకాల్‌పై సభ్యులు లేవనెత్తిన అంశాలపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్లో ప్రొటోకాల్ సమస్యలు ఉత్పన్నం కాకుండా శాశ్వతంగా చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి దీనిపై చర్చించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశంలో రాజకీయపరమైన విభేదాలు వద్దని అన్నారు.

**ఏకపక్షంగా అనుమతులు ఇవ్వడం తగదు**

మండలంలో తనకు తెలియకుండా ఏకపక్షంగా పనులు మంజూరు చేయడంపై రొంపిచర్ల జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌ను నిలదీశారు. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో నేరుగా పనులు మంజూరు చేస్తే ఇక తామెందుకని ప్రశ్నించారు. జెడ్పీటీసీలకు తెలియకుండా పనులు కట్టబెట్టేసి, వాటిని ఆమోదించేందుకు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. దశాబ్దాల తరబడి ఉన్న సంప్రదాయాన్ని కాలరాశారని విమర్శించారు. హెనీ క్రిస్టినాతోపాటు సీఈవో వి.జ్యోతిబసు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.



సమావేశంలో ఎమ్మెల్సీలు ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, మర్రి రాజశేఖర్, హనుమంతరావు

➡ ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లలకు ఉచిత విద్య నిరాకరణపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని విద్యార్థులను ఫీజు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు పర్చారని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు స్పష్టం చేశారు.

➡ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాల మంజూరులో జరుగుతున్న అన్యాయంపై ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే బి.రామాంజనేయులు వ్యవసాయశాఖాధికారులను నిలదీశారు.

➡ అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ పేరుకే రాజధాని తప్ప అమరావతిలో జెడ్పీ హైస్కూల్ లేకపోవడం సిగ్గుచేటన్నారు. తాను ప్రతి సమావేశంలోనూ అధికారుల దృష్టికి తీసుకువస్తున్నా ప్రయోజనం శూన్యమన్నారు.

➡ ముట్లూరు జెడ్పీ హైస్కూళ్లో 600 మంది విద్యార్థులు ఉండగా, బోధనేతర సిబ్బంది ఒక్కరూ లేరని, తక్షణమే నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు కోరారు.

➡ బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నిర్బంధ విద్యా హక్కుచట్ట ప్రకారం పేదల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించని పాఠశాలల వివరాలను బహిరంగ పర్చాలని, చట్టం అమల్లో క్షేత్ర స్థాయిలో నెలకొన్న ఇబ్బందులను తన దృష్టికి తేవాలని మూడు జిల్లాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు.

➡ రొంపిచర్ల జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు అమ్మకు వందనం కింద రూ.15వేలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, ఆ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు.

➡ పలువురు జెడ్పీటీసీలు మాట్లాడుతూ మాచర్ల మండలంలోని ఎస్టీ బాలికల హాస్టల్లో టాయిలెట్ వసతి లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకుంటున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక టన్ను రూ.600 ఉంటే ప్రస్తుతం రూ.1,500 చేరిందని, ఇక ఉచితం ఎక్కడని నిలదీశారు. భట్టిప్రోలు పీహెచ్‌సీలో వైద్యులు మధ్యాహ్న 12 గంటలకే వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. పాఠశాలల వద్ద విక్రయిస్తున్న నాసిరకం తినుబండారాల విక్రయాలను తక్షణమే ఆపి వేయాలని కోరారు. వట్టిచెరుకూరు రింగ్‌రోడ్డు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పల్నాడు జేసీ జి.సూరజ్ భరద్వాజ్ ధనుంజయ్, బాపట్ల జేసీ ప్రఖర్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### గురుకుల పాఠశాలల్లో తాగునీటి కొరతపై ఆగ్రహం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కాకుమానులోని ఎస్సీ గురుకుల పాఠశాలలో తాగునీటి కొరతపై ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నా, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ప్రతి సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నా శాశ్వత చర్యలు చేపట్టడం లేదని అన్నారు. ఇదే అంశంపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ బాలికల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు జెడ్పీ నిధులను పూర్తి స్థాయిలో కేటాయించాలని కోరారు. ఎస్ఆర్ఈజీఎస్‌తోపాటు నీతి ఆయోగ్ నిధులను హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేయగా, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జోక్యం చేసుకుని నెలరోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

### పత్తి కొనుగోలు బాధ్యత సీసీఐదే

ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

పత్తి కొనుగోలులో సీసీఐ అధికారులు ఇష్టారాజ్యంగా నిబంధనలు విధిస్తున్నారని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అన్నారు. నల్లకాయ వచ్చిందని, తడి చేరిందని రైతులు తెచ్చిన పత్తిని వెనక్కి పంపుతున్నారని, ఎటువంటి షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు తావు లేకుండా చూస్తామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు చేపడతామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని స్పష్టం చేశారు.

---

# మా ఫిర్యాదులపై చర్యలేవి?

- లోకేశ్, అయ్యన్నపాత్రుడిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోరా?
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులను ఎలా జైలుకు పంపారు?
- ఐ– టీడీపీపై ఫిర్యాదు చేస్తే స్పందించరా?
- గుంటూరులోని ఐదు పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లి సిబ్బందిని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



గుంటూరులో ఫిర్యాదుల విషయమై పోలీసు అధికారిని ప్రశ్నిస్తున్న అంబటి రాంబాబు

లక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్, ఆయన కుటుంబం, తన కుటుంబంపై పోస్టులు పెట్టిన మంత్రి లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసులు ఎందుకు రిజిస్టర్ చేయలేదని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులను నిలదీశారు. శనివారం సాయంత్రం పాత గుంటూరు, లాలాపేట, అరండల్‌పేట, నగరంపాలెం, పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లకు పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, ఫిర్యాదుదారులతో కలిసి వెళ్లారు. ఐ–టీడీపీ సోషల్ మీడియాపై ఇచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17, 18, 19వ తేదీల్లో నగరంలోని ఐదు పోలీస్‌స్టేషన్‌లలో 10 ఫిర్యాదులు చేశామని తెలిపారు. వాటి దర్యాప్తు గురించి తెలుసుకునేందుకు స్టేషన్‌లకు వెళ్లినట్టు చెప్పారు. ఎస్‌హెచ్‌వోలు లేరని, ఫోన్ చేసి ఫిర్యాదుల గురించి అడిగితే పరిశీలిస్తున్నామని, విచారణ చేస్తున్నామని చెబుతున్నారన్నారు. ఫిర్యాదు చేసిన తరువాత ముందు కేసు రిజిస్టర్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేయాల్సింది పోయి పరిశీలిస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. అదే లోకేశ్ ఫిర్యాదు చేస్తే మాత్రం పోలీసు శాఖ వెంటనే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు 100మందిపై సుమారు 300పైగా కేసులు రిజిస్టర్ చేసిందని చెప్పారు. అర్ధరాత్రి వేళ అరెస్టులు చేసి, థర్డ్ డిగ్రీ కూడా ప్రయోగించారన్నారు. మరి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదులపై పోలీసులు ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని నిలదీశారు. పోలీసుల పనికి లోకేశ్ అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. అవసరమైతే పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడతామని, అప్పటికీ న్యాయం జరగకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. సాక్షాత్తూ డీజీపీ సైతం లోకేశ్ చెప్పిన విధంగానే నడుచుకుంటున్నారని ఆరోపించారు. అంబటి రాంబాబు వెంట పార్టీ మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ, నాయకులు అంగడి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, మహమూద్, మల్లవరపు రమ్య, బూసి రాజలత, ధూపాటి వంశీ, కో–ఆప్షన్ సభ్యుడు పూనూరి నాగేశ్వరావు, లీగల్ సెల్ నాయకులు భగవాన్ తదితరులు ఉన్నారు.

**త్వరలో ప్రైవేటు కేసులు వేస్తాం...**

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోకుండా ఇదే తరహాలో పోలీసులు చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అంబటి స్పష్టం చేశారు. ప్రైవేటు కేసులు వేసి అక్కడే తేల్చుకుంటామని చెప్పారు.

# న్యాయవాద వృత్తిలో ఎన్నో సవాళ్లు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్



మాట్లాడుతున్న జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, వేదికపై లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: ప్రపంచంలోనే మన రాజ్యాంగం మహోన్నతమైనదని ఏపీలోని అమరావతి హైకోర్టు జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు న్యాయశాస్త్రాన్ని అభ్యసించి సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం దక్కేలా కృషి చేయాలన్నారు. రోజూ కొత్త విషయాలను, టెక్నాలజీలను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. న్యాయవాది వృత్తి సవాళ్లతో కూడుకున్నదని తెలిపారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, హోటల్స్, స్పోర్ట్స్, ఎంటర్‌టైన్‌మెంట్ వంటి రంగాలలో న్యాయశాస్త్రం చదివిన విద్యార్థులకు డిమాండ్ పెరిగిందన్నారు. వివిధ కార్యక్రమాల్లో సత్తా చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, నగదు బహుమతులను అందజేశారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

# బడుగుల ఇళ్లపై టీడీపీ పిడుగు!



లాంలో నిర్మాణంలో ఉన్న భవనం కూల్చివేస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలపై టీడీపీ నేతల అరాచకం కొనసాగుతూనే ఉంది. పైసా పైసా కూడబెట్టి ఎన్నో ఆశలతో కట్టుకున్న ఇళ్లను ఆక్రమణల పేరుతో కూలగొట్టారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాం గ్రామంలోని ఈ స్థలం విలువ భారీగా ఉండటంతో తెలుగు తమ్ముళ్ల కన్ను పడటమే దీనికంతటికీ కారణం. గతంలో పనిచేసిన అధికారులు అక్రమాలు పాల్పడటానికి తోడు ఇప్పుడు అధికార పార్టీ నేతల ధన దాహానికి బడుగులే సమిధలయ్యారు.

-8లో

**వాణిజ్యం**

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,400** గరిష్ఠం : రూ. **3,200**

మోడల్ ధర రూ. **2,800**

## 25న జిల్లాస్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్

**గుంటూరు ఎడ్యుకేషన్:** జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్-2024 నిర్వహించనున్నారు. ఈ నెల 25న పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చెత్త నుంచి సంపద తయారు చేయడం అనే అంశంపై విద్యార్థులచే వివిధ రకాల నమూనాలను రూపొందించి, ప్రదర్శించేలా సైన్స్ ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని సూచించారు. ''పర్యావరణ కాలుష్యం – నివారణకు జాగ్రత్తలు'' అనే అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించి సర్టిఫికెట్, బహుమతులు అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గైడ్ టీచర్ సహాయంతో పోటీలకు పంపాలని కోరారు. సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా (78428 69407)ను సంప్రదించాలని సూచించారు.

## హెచ్‌ఐవీ బాధితులకు ఆధునిక చికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ హరికృష్ణ

**గుంటూరు మెడికల్:** హెచ్‌ఐవీ బాధితులకు ఆధునిక చికిత్సా పద్ధతులతో నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని ప్రముఖ ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, ధృతి హాస్పిటల్ అధినేత డాక్టర్ రేవూరి హరికృష్ణ అన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 66వ రాష్ట్ర సదస్సులో శనివారం ఆయన 'హెచ్‌ఐవీ ఎసెన్షియల్స్ వైటల్ గైడ్ ఫర్ ఎవిరీ ప్రాక్టీషనర్'పై మాట్లాడారు. ప్రస్తుతం హెచ్‌ఐవీ బాధితులు నెలకు ఇన్ని మందులని మింగుతున్నారని, ఆ పనిలేకుండా ఆరు నెలలకొకసారి ఇంజక్షన్ చేయించుకుంటే సరిపోతుందని వివరించారు. ఈ ఏడాదే ఇండియా మార్కెట్‌లోకి ఇంజక్షన్లు అందుబాటులోకి వస్తాయన్నారు. సీడీ4 కౌంట్‌తో సంబంధం లేకుండా హెచ్‌ఐవీ పాజిటివ్ నిర్ధారణ జరగగానే చికిత్స అందించాలని చెప్పారు. భార్యాభర్తల్లో ఒకరికి హెచ్‌ఐవీ పాజిటివ్ ఉన్నప్పటికీ పిల్లలకు హెచ్‌ఐవీ సోకకుండా మందులు వాడి కనవచ్చని వివరించారు. కొత్తగా ఏఆర్టీ మందులు వాడుతున్న వారిలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావడం లేదని పేర్కొన్నారు. హెచ్‌ఐవీ బాధితులు ఇతర ఇన్‌ఫెక్షన్లు సోకకుండా న్యుమోనియా, ఫ్లూ, న్యుమోకోకల్ వ్యాక్సిన్లు చేయించుకోవాలని చెప్పారు. హెచ్‌ఐవీలో ఇండియాలో ఏపీ ద్వితీయ స్థానంలో ఉందని చెప్పారు. కొత్తగా నమోదవుతున్న హెచ్‌ఐవీ కేసుల్లో తగ్గుదల ఉందని చెప్పారు. మరణాలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. హెచ్‌ఐవీ నిర్ధారణ, బాధితులకు చికిత్స, ఆధునిక చికిత్సల గురించి వివరించారు.

## సాంకేతికతతో వైద్యరంగం కొత్త పుంతలు

**గుంటూరు మెడికల్:** రానున్న రోజుల్లో రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కనుందని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. యువ వైద్యులు ఈ విప్లవాత్మక మార్పులపై దృష్టి సారించాలని సూచించారు. గుంటూరు మెడికల్ కాలేజ్ జింఖానా ఆడిటోరియంలో జరుగుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సులో కీళ్ల మార్పిడిలో రోబోటిక్ పాత్ర అంశంపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెండు సంవత్సరాల క్రితం వరకు వైద్యరంగంలో రోబోటిక్, ఏఐల పాత్ర అంతంత మాత్రమేనని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రతి విభాగంలోనూ వాటి ముద్ర వేస్తున్నాయని తెలిపారు. ఒక్క కీళ్ల మార్పిడి అంశంలోనే దేశవ్యాప్తంగా 12 వేల రోబోటిక్స్ ఉన్నాయని చెప్పారు. సాంకేతికత వినియోగం పెరిగేకొద్దీ పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని డాక్టర్ నరేంద్ర రెడ్డి వెల్లడించారు.



మాట్లాడుతున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి

## ఆళ్ల నాగేశ్వరరావుకు గద్దర్ పురస్కారం



**తెనాలి:** తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరానికి చెందిన మమత స్వచ్ఛంద సేవాసమితి ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్ జాతీయ సాహితీ సేవా పురస్కారానికి తెనాలికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబరు 12వ తేదీన ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. గద్దర్ కుమార్తె, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, సాహితీ అకాడమీ చైర్మన్ డాక్టర్ జీవీ వెన్నెల చేతులమీదుగా ఆళ్లకు పురస్కారం బహూకరిస్తారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్ శనివారం తెలిపినట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# బడుగుల ఇళ్లపై టీడీపీ పిడుగు!

- కోర్టు ఆదేశాలను అడ్డుపెట్టుకుని యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి ఇళ్ల కూల్చివేత
- పోలీసులను భారీగా మోహరింపజేసి తెల్లవారుజామున భవనాల నేలమట్టం
- అధికారుల అండతోనే క్రయవిక్రయాలు జరిగాయని బాధితుల ఆరోపణ
- ఆక్రమించారని చెబుతున్న చోట ఇంటిపన్ను, కరెంటు బిల్లు ఎలా ఇచ్చారని నిలదీత
- తమకు వెంటనే తగిన న్యాయం చేయాలని బాధితుల డిమాండ్



తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న ఓ బాధితుడు

**తాడికొండ:** గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాం గ్రామంలో బడుగుల ఇళ్లపై అర్ధరాత్రి పిడుగు పడింది. ఆక్రమణల తొలగింపు పేరుతో లాం గ్రామంలో శనివారం తెల్లవారు జామున కోర్టు ఆదేశాలను అడ్డుపెట్టి టీడీపీ నాయకుల కనుసన్నల్లో పేదల ఇళ్లను రెవెన్యూ, పోలీసు అధికారులు భారీగా మోహరించి కూల్చివేశారు.

**కోర్టు సెలవులు చూసుకుని మరీ...**

టీడీపీకి చెందిన షేక్ సుభాని అనే నాయకుడు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు గతంలో కూల్చివేయాలని ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలు వచ్చి చాలా రోజులైనప్పటికీ అధికారులు అడుగు ముందుకు వేయలేదు. భూముల ధరలు ఆకాశాన్నంటడంతో ఈ భూములపై టీడీపీ నాయకులు కన్నేశారు. అంతే.. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి కోర్టు సెలవులు చూసుకొని శనివారం తెల్లవారుజామున కూల్చివేయించారు. గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు సర్వే నిర్వహించి 43 అక్రమ నిర్మాణాలు ఉన్నాయని తేల్చి నోటీసులు జారీ చేశారు. అయితే గత తహసీల్దార్, వీఆర్వో సంతకాలతో కూడిన పొజిషన్ సర్టిఫికెట్లతోనే ఈ తంతు అంతా నడిచిందని సర్వేలో తేల్చారు. అధికారులపై ఎక్కడ చర్యలు తీసుకోవాల్సి వస్తుందో అని వెనకడుగు వేసిన మిగతా యంత్రాంగం... ఇప్పుడు టీడీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక పేదలపై ప్రతాపం చూపింది. అసలు నిందితులను వదిలి పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న పేదల నిర్మాణాలను కూల్చివేశారు. తహసీల్దార్ కె. నాసరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పనులలో సీఐ కె. వాసు పోలీసు బందోబస్తు నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

**అధికారులు, నాయకులు కుమ్మక్కు**

లాం నుంచి తాతిరెడ్డిపాలెం వెళ్లే రోడ్డులో పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీలో మిగిలిపోయిన ప్లాట్లను కొందరు అధికారులు, నాయకులు కుమ్మక్కై భారీగా సొమ్ము చేసుకున్నారు. వీటికి గత తహసీల్దార్, వీఆర్వో సంతకంతో కూడిన పొజిషన్ సర్టిఫికెట్లు కూడా జారీ చేశారు. కాగా మరి కొంతమందికి స్టాంపు పేపర్లపై భూమిని వేరే వారిదిగా చూపించి భారీగా అమ్మకాలు చేసి రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నారు. అక్రమం అని తెలిసినా అధికారులు ఈ స్థలాలకు ఇంటిపన్ను, కరెంటు బిల్లులు వేసి అప్పగిస్తుండటంతో అక్రమణల పర్వం మూడు పువ్వులు ఆరు కాయల్లా విరాజిల్లింది.

**అన్నీ ఇచ్చిన యంత్రాంగంపై చర్యలేవీ?**

అధికారికంగా అన్నీ వస్తుండటంతో ఆశపడిన కొనుగోలుదారులు ఎగబడి కొన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తీరా ఇప్పుడు కూలదోస్తుండటంతో అధికారుల అండదండలతోనే కొన్నామని బాధితులు ఆరోపణలు చేస్తున్నారు. పైసా పైసా కూడగట్టి కొనుగోలు చేసిన ఇళ్లను కూల్చుతున్న అధికారులు అసలు ఈ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు, ఇంటిపన్ను, కరెంటు బిల్లు ఎలా ఇచ్చారని నిలదీస్తున్నారు. వాటిని అమ్మి సొమ్ము చేసుకున్న వారిపై చర్యలెక్కడ అని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి గత తహసీల్దార్ సంతకాలతో కూడిన పొజిషన్ సర్టిఫికెట్లతో స్థలాలు విక్రయించి కొనుగోలుదారులను మోసగించిన వారిని ఎందుకు వదిలేశారని పేర్కొన్నారు. 38 సంవత్సరాలుగా ఇల్లు లేకుండా నివసిస్తుంటే పట్టించుకోని అధికారులు.. ఇప్పుడు వచ్చి ఉన్న ఇల్లును కూలగొడితే ఎలా అని మరో బాధితుడు వాపోయాడు. తన తమలాంటి పేదలపై ప్రతాపం చూపడం మాని తగిన న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## అనుమానంతో భార్య హత్య



శివపార్వతి మృతదేహం

**పెడసనగల్లు (మొవ్వ):** మొవ్వ మండలం పెడసనగల్లు గ్రామంలో భార్యపై అనుమానంతో భర్త పచ్చడి బండతో తలపై కొట్టి హత్య చేశాడు. ఈ ఘటన శనివారం వేకువజామున వెలుగు చూసింది. కూచిపూడి ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల మేరకు.... పెడసనగల్లు గ్రామానికి చెందిన శివ పార్వతి (32)కి గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, బండారుపల్లి గ్రామానికి చెందిన తుపాకుల అశోక్‌తో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ సంతానం, వీరు పెడసనగల్లు గ్రామంలో నివాసం ఉంటున్నారు. శివపార్వతి కూచిపూడిలోని బిర్యానీ హోటల్‌లో పనిచేస్తోంది. భర్త అశోక్ పామర్రు మండలం పరిశేపల్లి గ్రామంలో ఒక రైతు వద్ద పని చేస్తున్నాడు. అశోక్ మద్యానికి బానిసై తరచూ శివపార్వతిని అనుమానిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి పెడసనగల్లులో ఇంటి వద్ద నిద్రపోతున్న శివపార్వతి తలపై పచ్చడి బండతో కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయింది. మృతురాలి తల్లి తలుపుల దుర్గ ఆ సమయంలో కేకలు విని అక్కడ వచ్చి చూడగా అశోక్ పరారయ్యాడు. దుర్గ శనివారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సమాచారం తెలుసుకున్న కూచిపూడి ఎస్ఐ సుబ్రహ్మణ్యం, పామర్రు సీఐ వి.సుభాకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## కొనసాగిన శ్రీవిధుశేఖర భారతి స్వామి పర్యటన



ఆర్ అగ్రహారంలోని శ్రీరామనామ క్షేత్రంలో శ్రీశృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి



జస్టిస్ భట్టితో వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

**నగరంపాలెం:** శ్రీ శృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతీ స్వామి విజయ యాత్ర మహోత్సవాల్లో భాగంగా నగర పర్యటన మూడో రోజైన శనివారం కూడా కొనసాగింది. సంపత్‌నగర్ శ్రీశృంగేరీ శంకర మఠం శ్రీశారదా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో జగద్గురు మహాస్వామి వారి దివ్య సన్నిధిన కృష్ణ యజుర్వేద హవన పూర్ణాహుతి, కౌథుమ సామవేద హవన పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం సుమారు 150 మంది వేద పండితులతో వేద సభ చేపట్టారు. స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జస్టిస్ భట్టిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిలు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆర్డీఓ కె.శ్రీనివాసరావు వెంట ఉన్నారు. ఆర్ అగ్రహారంలోని శ్రీరామనామ క్షేత్రాన్ని స్వామి సందర్శించారు. శ్రీఆంజనేయస్వామిని దర్శించుకుని, భక్తులు రాసిన శ్రీరామనామ పుస్తకాలను భద్రపరిచిన స్థూపాలకు పుష్పాలను సమర్పించారు. పల్లకి, భవనంలో శంకరకృప వసతి సముదాయాన్ని ప్రారంభించారు. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

## గుంటూరు వైద్య కళాశాలకు బస్సు వితరణ



డాక్టర్ సుందరాచారికి చెక్కు అందజేస్తున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి, చంద్రారెడ్డి

**గుంటూరు మెడికల్:** గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ వైద్య విద్యార్థులు కళాశాల ప్రగతికి తమవంతుగా ముందుకు వచ్చారు. ఈ బ్యాచ్‌లో బాహుబలి సర్జన్‌గా గుర్తింపు పొందిన ప్రముఖ న్యూరో సర్జన్, గుంటూరు బ్రిండ హాస్పిటల్ అధినేత డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు విరాళాలు ఇచ్చారు. వైద్య విద్యార్థులకు కళాశాల నుంచి హాస్టల్‌కు వెళ్లేందుకు అవసరమైన రూ. 40 లక్షలు ఖరీదు చేసే బస్సు కొనుగోలు నగదు సమకూర్చారు. శనివారం డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పుణ్యాల శ్రీనివాసరెడ్డి తండ్రి చంద్రారెడ్డిలు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారికి చెక్కు అందజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. శ్రీనివాసరెడ్డికి చెప్పగానే స్పందించి కేవలం 15 రోజులలో భారీ విరాళం అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.